## క్లుప్తంగా

సాక్షి స్పందన

### మురుగు నీరు రాకుండా మరమ్మతులు



కాలువ శుభ్రం చేయిస్తున్న అధికారులు

సుల్తానాబాద్: పట్టణంలోని శాస్త్రినగర్‌లో సోషల్ వెల్ఫేర్ కళాశాలకు వెళ్లే రహదారిపై మురుగు నీరు అనే కథనం సాక్షి ప్రచురించింది. మున్సిపల్ సిబ్బంది, అధికారులు స్పందించి రోడ్డుపైకి మురుగు నీరు రాకుండా జేసీబీ సహకారంతో పూడుకపోయిన మట్టిని తొలగించారు.

### సుల్తానాబాద్ కోర్టు ఏజీపీగా లక్ష్మిరాజం



సుల్తానాబాద్: సుల్తానాబాద్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా సుల్తానాబాద్‌కు చెందిన సీనియర్ న్యాయవాది ఆవుల లక్ష్మిరాజంను నియమిస్తూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావుతో పాటు కాంగ్రెస్ మండల నాయకులు, బార్ అసోసియేషన్ న్యాయవాదులకు లక్ష్మీరాజం కృతజ్ఞతలు తెలిపారు.

### నేడు ముత్తారంలో కలెక్టర్ పర్యటన

ముత్తారం: మండలంలో బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పర్యటించనున్నారు. పలు గ్రామాల్లో సందర్శిస్తూ పాఠశాలలో అమ్మ ఆదర్శ పనుల పరిశీలనతోపాటు పలు అభివృద్ధి పనులను పరిశీలించనున్నారు.

### పోలీస్ స్టేషన్ సందర్శన

ఓదెల: పొత్కపల్లి పోలీస్ స్టేషన్‌ను సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి మంగళవారం సందర్శించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో పెండింగు కేసుల వివరాలడిగి తెల్సుకున్నారు. స్టేషన్‌కు వచ్చే ప్రజలతో స్నేహ సంబంధాలను పెంచుకోవాలన్నారు. పిటిషన్లను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నారు. ఎస్సై జి.అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

### ఆర్థిక సాయం



నగదు అందిస్తున్న తిరుపతిరెడ్డి

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రానికి చెందిన టి.రమేశ్ గుండెపోటుతో ఇటీవల మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులను మాజీ జెడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి మంగళవారం పరామర్శించారు. ఆర్థిక సాయమందించారు. మాజీ ఎంపీటీసీ తూన్ల ప్రవీల, మాజీ సర్పంచ్ శ్రీదేవి, ఇబ్రహీం, సాంబారావు, రాజయ్య ఉన్నారు.

### ఉద్యోగాలు ఇప్పించండి



సీతారామయ్యకు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

రామగిరి: సింగరేణిలో మారు పేర్ల విజిలెన్స్ పెండింగ్ కేసుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని మంగళవారం ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్యకు విజిలెన్స్ బాధితులు వినతిపత్రాన్ని అందజేశారు. ఆర్జీ–3 జీఎం కార్యాలయం వద్ద బాధితులు సీతారామయ్యను కలిసి గోడు వెల్లబోసుకున్నారు. సింగరేణి సంస్థలో 30 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకొని అనారోగ్య కారణాలతో మెడికల్ అన్‌ఫిట్ డిపెండెంట్ ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకుంటే.. విజిలెన్స్ అధికారులు మారు పేర్లు, రెండు పేర్లున్నాయని తెలుపుతూ ఉద్యోగాలివ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు.

### పరిసరాల పరిశుభ్రతపై చర్యలు చేపట్టాలి

ముత్తారం: గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో లలిత అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎంపీవో వేణుమాధవ్ ఉన్నారు.

### రోడ్ల పనులు పరిశీలన

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ మూడో డివిజన్ న్యూపోరట్‌పల్లిలో సీసీ రోడ్లు, యూజీడీ అన్ని ప్రాంతాల ప్రజలకు ఉపయోగపడేలా నిర్మించాలని ప్రజలు సీఎస్సార్ అధికారులను కోరారు. ఎన్టీపీసీ రామగుండం సీఎస్సార్ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్లు, యూజీడీ పనులను సంబంధిత సీఎస్సార్ అధికారులు పరిశీలించారు. స్థానికులు ఈదునూరి లింగయ్య, రాజేశ్వరి, రామదాసు, సాయమ్మ అన్ని ప్రాంతాల ప్రజలకు ఉపయోగపడేలా నిర్మించాలని కోరారు.

# జోరందుకున్న వరి నాట్లు

- అదనులో సాగు.. దిగుబడులకు మేలు
- ప్రారంభమైన పంటల సీజన్
- రోహిణి వరి నార్లతో ఎక్కువ దిగుబడి



జూలపల్లిలో వరి నాట్లు వేస్తున్న మహిళలు



జూలపల్లిలో నాటుకు దుక్కులు సిద్ధం

జూలపల్లి: రైతులు పంటల సాగును అదనులో చేపడితే ఎక్కువ దిగుబడులు పొందే అవకాశముంటుంది. సమయానుకూలంగా కాక కార్తెలను అనుసరిస్తూ సాగులో మెళకువలు పాటిస్తే నాణ్యమైన దిగుబడులు సాధించొచ్చని వ్యవసాయ శాఖ అధికారులంటున్నారు. అదను దాటి సాగు చేస్తే చీడపీడల బారిన పడక తప్పదు. దీంతో రసాయన ఎరువుల వాడకం పెరిగి పెట్టుబడులు అధికమై.. వ్యవసాయం లాభసాటిగా లేకపోగా.. నష్టపోవాల్సి వస్తుంది. సాగును లాభసాటిగా మార్చుకోవాలంటే అదనులో విత్తనాలు వేయాలని అధికారులు సూచిస్తున్నారు.

**రోహిణి కార్తెలో వరి సాగు మేలు**

రోహిణి కార్తెలో బావులు, బోర్ల కింద వరి నార్లు జూన్ మొదటి వారం నుంచి జూలై రెండో వారంలోనే వేసుకుంటే.. పూర్తి పంట దిగుబడి వచ్చేందుకు అవకాశముంటుంది. ఇందుకు విత్తన ఎంపికలో జాగ్రత్తలు పాటించి నాణ్యమైన విత్తనాలు వాడితే చీడపీడలు ఆశించకుండా పూర్తిస్థాయిలో పంటను పండించొచ్చు. దీంతో రసాయన ఎరువుల వాడకం తగ్గి పెట్టుబడి తగ్గడంతో రైతులకు లాభాలు వచ్చే అవకాశముంటుంది.

**వాణిజ్య పంటలు లాభదాయకం**

జూన్ మొదటి వారం నుంచి పంటల సాగుకు అనువుగా ఉండగా.. వాణిజ్య పంటల సాగు మేలు చేస్తుంది. పప్పు దినుసులు, మిర్చి, పసుపు పంటలు ఎక్కువ పండే అవకాశముంటుంది. మొక్కజొన్నకు కూడా అనువుగా ఉంటుంది. రైతులు అదనులోనే విత్తనాలు వేసి అధిక దిగుబడులతోపాటు లాభాలు పొందొచ్చని సూచిస్తున్నారు. జిల్లాలో వానాకాలంలో బావులు, బోర్లు, చిన్న నీటిపారుదల కుంటలు, చెరువుల కింద, ఎస్‌ఆర్‌ఎస్పీ ప్రాజెక్టు కింద వచ్చే సాగు నీటితో ప్రస్తుతం 13,685 ఎకరాల్లో వరి సాగు చేస్తారని, 4,622 ఎకరాల్లో పత్తి సాగు, 125 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అంచనాలు తెలుపుతున్నాయి. అదనులో సాగుతోపాటు భూసార పరీక్షలు, నాణ్యమైన విత్తనాలు, పచ్చిరొట్ట ఎరువులతో భూమిలో భూసారం పెరిగి దిగుబడులు అధికంగా వచ్చి లాభాలు పొందొచ్చని వ్యవసాయ శాఖ సూచనలు చేస్తోంది.

### రోహిణి నారుతో ఎక్కువ పంట



బావుల కింద రోహిణి నార్లు పోస్తే పంట ఎక్కువ వస్తుంది. నీటి సౌకర్యం ఉంటేనే నార్లు పోయాలి. మంచి నాణ్యమైన విత్తనాలు తీసుకొని వేస్తే చీడపీడల నుంచి కొంతవరకైనా కాపాడుకోవచ్చు. పంట కూడా ఎక్కువ వస్తుంది.

– నాదెం మల్లారెడ్డి, ఉత్తమ రైతు, జూలపల్లి

### జాగ్రత్తలు తీసుకోవాలి



రైతులు వానాకాలం పంటల సాగులో జాగ్రత్తలు తీసుకోవాలి. భూసార పరీక్షలు, అవసరమైన సేంద్రియ ఎరువులు వాడాలి. నాణ్యమైన విత్తనాలు తీసుకొని శుద్ధి చేసుకొని వేసుకోవాలి. సూచించిన మేరకు సస్యరక్షణ చర్యలతో పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించొచ్చు.

– ప్రత్యూష, మండల వ్యవసాయాధికారి, జూలపల్లి

## సింగరేణి సంస్థ రెస్క్యూ జీఎంకు సన్మానం



సన్మానిస్తున్న టెన్నిస్ క్లబ్ సభ్యులు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి సంస్థ రెస్క్యూ జీఎంగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కె.శ్రీనివాస్‌రెడ్డిని యైటింక్లయిన్‌కాలనీ సీఈఆర్ టెన్నిస్ క్లబ్ సభ్యులు మంగళవారం ఘనంగా సత్కరించారు. వకీల్‌పల్లి గనిలో ప్రాజెక్ట్ అధికారిగా విధులు నిర్వహించి సింగరేణి సంస్థ రెస్క్యూ జీఎంగా పదోన్నతి పొందిన శ్రీనివాస్‌రెడ్డికి టెన్నిస్ క్లబ్ సభ్యులు శుభాకాంక్షలు తెలిపి శాలువా, జ్ఞాపికతో సన్మానించారు. శ్రీనివాస్, చంద్రశేఖర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, రవి, శేఖర్, సంజీవ్‌యాదవ్, వెంకటేశ్వర్లు, పింగిళి కృష్ణారెడ్డి, శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, శశి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి: రాణాపూర్ గ్రామానికి చెందిన కొండ్ర శంకర్ మాదిగను మాదిగ దండోర ఆధ్వర్యంలో సత్కరించారు. ఈనెల 7న హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగిన మాదిగ దండోర రజతోత్సవ వేడుకల్లో ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కొండ్ర శంకర్ మాదిగల సమస్యల పరిష్కారానికి సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాల్లో పాల్గొంటూ సంఘం అభివృద్ధికి చేస్తున్న కృషికి గాను ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మేడి పాపయ్య సత్కరించి జ్ఞాపిక బహూకరించారు.

పాలకుర్తి: మండలంలోని జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీల పదవీకాలం పూర్తయిన నేపథ్యంలో మంగళవారం మండల పరిషత్ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో శశికళ, కార్యాలయం సిబ్బంది ఆధ్వర్యంలో మాజీ జెడ్పీటీసీ సంధ్యారాణితోపాటు మాజీ ఎంపీపీ రమేశ్, మాజీ వైస్ ఎంపీపీ ఎర్రం స్వామి, ఎంపీటీసీలు పాత భాగ్యలక్ష్మి, దుర్గం కుమార్, మండల కోఆప్షన్ సభ్యుడు ఎండీ సర్వర్‌పాషాను సత్కరించారు. పాలకుర్తి రైతు వేదిక భవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీవో షబ్బీర్‌పాషా, పంచాయతీ రాజ్ ఏఈ శ్రీనివాస్, సదానందం, కొంరయ్య తదితరులు పాల్గొన్నారు.

మండల మాజీ ఎంపీపీ వ్యాళ్ల అనసూర్య–రాంరెడ్డిని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ సన్మానించారు. ముంజంపల్లిలోని వారి స్వగృహానికి వెళ్లి జ్ఞాపికను బహూకరించారు. నాయకులు అల్లం రాజయ్య, ఇంజపూరి నవీన్, కోల లత తదితరులు పాల్గొన్నారు.

### స్తంభాలను సరిచేసిన సిబ్బంది

పెద్దపల్లిరూరల్: జిల్లాలో వంగిన, విరిగిన విద్యుత్ స్తంభాలను గుర్తించి సరిచేసే పనులను విద్యుత్ సిబ్బంది నిర్వహిస్తున్నారు. రాఘవాపూర్, బొంపల్లితోపాటు మంథని, అంతర్గాం పరిధిలో మంగళవారం సరిచేసే పనులు చేపట్టినట్లు ఎస్ఈ బొంకూరి సుదర్శన్ తెలిపారు. వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

### ఎరువుల దుకాణాల తనిఖీ



ఎలిగేడులో స్టాకు వివరాలు పరిశీలిస్తున్న ఏవో ఉమాపతి

ఎలిగేడు: మండల కేంద్రంతోపాటు ధూళికట్ట గ్రామంలో మంగళవారం ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ శాఖ అధికారి ఎం.ఉమాపతి తనిఖీ చేశారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఇబ్బందులు కాకుండా సరిపడా ఎరువులను దుకాణాల్లో ఉంచాలని యజమానులకు సూచించారు. ఎరువుల విక్రయాలను ఈపాస్‌లో నమోదు చేయాలని, స్టాకు రిజిస్టర్, బిల్లు బుక్కులు ప్రతిరోజు సవరించాలని సూచించారు. ఎలిగేడు, ధూళికట్ట గ్రామాల్లో పంట వివరాలను సేకరించి నమోదు చేసినట్లు ఏవో తెలిపారు.

### జెన్‌కో క్వార్టర్‌లో విద్యుదాఘాతం

రామగుండం: పట్టణంలోని ఏ–కాలనీకి చెందిన జెన్‌కో ఉద్యోగి మోహినొద్దీన్ క్వార్టర్ నం.ఈ–48లోని కిచెన్ రూంలో మంగళవారం విద్యుదాఘాతంతో భారీగా మంటలు వ్యాపించడంతో ఫ్రిడ్జ్ అగ్నికి ఆహుతైంది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణాపాయం జరగలేదు. కుటుంబ సభ్యులు త్రుటిలో మంటల నుంచి తప్పించుకున్నారు. 50ఏళ్ల క్రితం నిర్మించిన జెన్‌కో క్వార్టర్లు పూర్తిగా లోతట్టుకు చేరి గోడలు శిథిలావస్థకు చేరడం, తలుపులు ఎక్కడికక్కడ విరిగిపోయి భద్రత కరువవడం, ప్రస్తుత వర్షాకాలం సీజన్‌లో వరద నీటితో గోడలు, స్లాబు సిమెంట్ పైపెచ్చులు ఊడిపోవడంతోపాటు గోడల నుంచి నీరు బయటకు రావడంతో తడిసి ముద్దయ్యాయి. ఈ క్రమంలోనే విద్యుత్ స్విచ్ బోర్డు సైతం నీటితో తడిసిపోవడంతో విద్యుదాఘాతం జరిగినట్లు భావిస్తున్నారు. ఫ్రిడ్జ్ పూర్తిగా కాలిపోగా.. గదులు పూర్తిగా మసితో నల్లబడిపోయాయి. మంటలు చెలరేగడంతో కుటుంబ సభ్యులు బయటకు పరుగులు తీయడంతో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు.

### జోరుగా ఎవెన్యూ ప్లాంటేషన్

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో హరితహారంలో భాగంగా ప్రధాన రహదారుల వెంట ఎవెన్యూ ప్లాంటేషన్ పనులు జోరుగా సాగుతున్నాయి. వర్షాలు కురుస్తుండడంతో కార్యదర్శులు మొక్కలు నాటే ప్రక్రియను వేగవంతం చేశారు. కుందనపల్లి గ్రామ శివారులోని రాజీవ్ రహదారి వెంట ఎవెన్యూ ప్లాంటేషన్ ప్రక్రియను ఎంపీడీవో అలీం పరిశీలించారు.

జూలపల్లి: మండల కేంద్రం నుంచి అబ్బాపూర్ వెళ్లే దారి వెంట ఈజీఎస్ ఆధ్వర్యంలో నాటిన మొక్కలను డీఆర్‌డీవో ప్లాంటేషన్ అధికారి మధుకర్ పరిశీలించారు. మొక్కల సంరక్షణ పద్ధతులను ఎఫ్‌ఏ నర్సయ్యకు సూచించారు.

### ప్రహరీ కూల్చివేసిన సిబ్బంది

జూలపల్లి: మండల కేంద్రంలో అధికారులు పట్టించుకోకపోవడంతో చూస్తుండగానే ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించుకుంటున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామ పంచాయతీ గోడ మీద ప్రైవేటు వ్యక్తులు గోడ నిర్మించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం ముందు ప్రహరీ ఉండగా.. పక్కనే పెస్టిసైడ్స్ యజమాని మల్లారెడ్డి ఇల్లు ఉంది. ప్రహరీపై గోడ నిర్మించగా.. కార్యదర్శి లచ్చయ్య ఆధ్వర్యంలో సిబ్బంది కూల్చివేశారు.

## డిమాండ్స్ డేను విజయవంతం చేయండి



కోల్‌సిటీ: కరపత్రం ఆవిష్కరిస్తున్న కార్మికులు

కోల్‌సిటీ: ఈనెల 10న డిమాండ్స్ డేను జయప్రదం చేయాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్(సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం, డిమాండ్ల సాధన కోసం డిమాండ్స్ డేను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రామగుండం కార్పొరేషన్ కార్యాలయం ఆవరణలో, వివిధ జోన్లలో కరపత్రం ఆవిష్కరించారు. మున్సిపల్ అధ్యక్ష, కార్యదర్శులు ఇస్లావత్ కిషన్‌నాయక్, ఉప్పులేటి రాధాకృష్ణ, బోయిని రవీందర్, వెంకటస్వామి, పిట్టల సంతోష్, కార్మికులు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన బొగ్గు గనుల వేలాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 10న అన్ని ఏరియాల్లోని సింగరేణి జీఎం కార్యాలయాల వద్ద చేపట్టనున్న ధర్నాను విజయవతం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ నాయకుడు ఉల్లి మొగిలి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన ఆర్జీ–2 డివిజన్ కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాంప్రసాద్, సంపత్‌కుమార్, సారంగం, వెంకటనర్సయ్య, సాంబారావు తదితరులు పాల్గొన్నారు.

జ్యోతినగర్: దేశంలోని కాంట్రాక్టు కార్మికులందరికీ కనీస వేతనం రూ.26వేలు చెల్లించేలా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించాలని సీఐటీయూ అనుబంధ రామగుండం ఇండస్ట్రియల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నాంసాని శంకర్ అన్నారు. మంగళవారం ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు లేబర్ గేట్ రోడ్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈనెల 10న రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న ధర్నా, ర్యాలీలో కార్మికవర్గం పాల్గొని డిమాండ్స్ డేను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సుల్తానాబాద్: ఈనెల 10న కార్మికుల కోరికల దినం జయప్రదం చేయాలని సీఐటీయూ మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సావనపల్లి వెంకటస్వామి కోరారు. మంగళవారం సుల్తానాబాద్‌లో మున్సిపల్ కార్మికుల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహేశ్, బాపు, రామ్మూర్తి, లక్ష్మి ఉన్నారు.

గోదావరిఖని: రాష్ట్రంలోని బొగ్గు బ్లాకులను సింగరేణి సంస్థకే కేటాయించాలని కోరుతూ ఈనెల 10న అన్ని జీఎం కార్యాలయాల ముందు నిర్వహిస్తున్న ధర్నా విజయవంతం చేయాలని సీఐటీయూ ఆర్జీ–1 కార్యదర్శి మెండె శ్రీనివాస్ కోరారు.

## హామీల అమలులో విఫలం



పెద్దపల్లిరూరల్: డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ ఏర్పడి 200 రోజులు గడుస్తున్నా.. ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చిలారపు పర్వతాలు, నియోజకవర్గ కన్వీనర్ దాడి సంతోష్ అన్నారు. తహసీల్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ తిరుపతికి వినతిపత్రం అందించారు. నాయకులు తంగెడ రాజేశ్వర్‌రావు, సంపత్‌రావు, తిరుపతి, శ్రీకాంత్, వేల్పుల రమేశ్, శ్రీనివాస్‌గౌడ్, గుడ్ల సతీష్, రాకేశ్, కుక్క వంశీ, సతీష్, పిట్టల వినయ్ తదితరులున్నారు.

సుల్తానాబాద్: కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని బీజేపీ నాయకులు ఆరోపించారు. తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. పట్టణ అధ్యక్షుడు కూకట్ల నాగరాజు మాట్లాడారు. మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు వనజ, మాటూరి లత, ఎనగందుల సతీశ్, ఎలవేని తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

జూలపల్లి: ఎన్నికలకు ముందు రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను షరతులు లేకుండా తక్షణమే అమలుకు చర్యలు తీసుకోవాలని కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో తహసీల్దార్ బషీరుద్దీన్‌కు వినతి పత్రం అందజేశారు. కొప్పుల మహేశ్, లక్కాకుల రమేశ్, సంగెం వేణుగోపాల్, ఆవుల రాజు, మల్లెత్తుల ఆంజనేయులు తదితరులున్నారు.

## సీత్లా భవాని ఆశీస్సులతో సుభిక్షంగా ఉండాలి



ఉత్సవాల్లో పాల్గొన్న విజయరమణారావు

ఓదెల: సీత్లా భవాని ఆశీస్సులతో పెద్దపల్లి ప్రజలు సుభిక్షంగా ఉండాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మంగళవారం లంబాడితండాలో జరిగిన సీత్లా భవాని ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పొత్కపల్లి సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి రవిగౌడ్, మాజీ సర్పంచ్ వస్తంనాయక్, మాజీ ఉప సర్పంచ్ గుగులోతు నిమ్మనాయక్, కుల పెద్దలు పాల్గొన్నారు.

సీత్లా భవాని పండుగను ఘనంగా జరుపుకోవాలని బీఆర్‌ఎస్ పెద్దపల్లి నాయకురాలు దాసరి ఉష అన్నారు. లంబాడితండాలో భవాని ఉత్సవాల్లో పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ ఎదుట మహిళ బైఠాయింపు



స్టేషన్ ఎదుట బైఠాయించిన మహిళ

రామగిరి: నెల రోజులైనా తనకు న్యాయం జరగడం లేదని, న్యాయం కోసం పోరాడితే చంపేస్తామని బెదిరిస్తున్నారని, తనకు రక్షణ కల్పించాలని మంగళవారం రామగిరి పోలీస్ స్టేషన్ ఎదుట మహిళ బైఠాయించింది. వివరాల్లోకి వెళ్తే.. బేగంపేట గ్రామానికి చెందిన దాసరి శివకుమార్ అనే వ్యక్తి తన పిల్లలను చంపుతానని బెదిరింపులకు గురిచేస్తూ పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా వాడుకొని మోసం చేశాడని, తన వద్ద నుంచి తీసుకున్న డబ్బులివ్వడం లేదని మే 25న దాసరి శివకుమార్, అతడి కుటుంబ సభ్యులపై అదే గ్రామానికి చెందిన మహిళ ఫిర్యాదు చేసింది. జూలై 8న రాత్రి గ్రామంలోని మెడికల్ దుకాణం సమీపంలో దాసరి శివ తమ్ముడు, సోదరి కేసు విషయంలో రాజీ పడాలని, లేదంటే చంపేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. అధికారులు స్పందించి న్యాయం చేయాలని స్టేషన్ ఎదుట బైఠాయించి ఆందోళన నిర్వహించింది. ఎస్సై కె.సందీప్‌కుమార్‌ను వివరణ కోరగా.. విచారణ చేస్తున్నామని తెలిపారు.

## ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం



గోదావరిఖనిటౌన్: పాల్గొన్న నాయకులు



సుల్తానాబాద్‌లో వందనం చేస్తున్న నాయకులు

గోదావరిఖనిటౌన్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్ పాల్గొని జెండా ఆవిష్కరించారు. గోదావరిఖని నగర కార్యదర్శి పిడుగు సిద్ధార్థ, నాయకులు ఉదయ్, సందీప్, రవి, భవాని, కావ్య, హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లిరూరల్: పట్టణంలో వేడుకలను జరుపుకున్నారు. విద్యారంగ సమస్యలపై ఏబీవీపీ అలుపెరుగని పోరాటం సాగిస్తోందని నగర కార్యదర్శి అజయ్ అన్నారు. రాకేశ్, విష్ణు, దినేశ్, అరవింద్, గణేశ్, వంశీ తదితరులున్నారు.

జూలపల్లి: మండల కేంద్రంలో స్టూడెంట్స్ ఫర్ సేవా ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక వివేకానంద విగ్రహం వద్ద జెండావిష్కరణ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఎస్‌ఎఫ్‌ఎస్ జిల్లా కన్వీనర్ ఉమేశ్ మాట్లాడారు. మారం ఓంప్రకాశ్, అఖిల్, సాగర్, హరీశ్, అనిల్, స్వామి తదితరులున్నారు.

సుల్తానాబాద్: విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో ఏబీవీపీ ముందంజలో నిలిచిందని ఏబీవీపీ హాస్టల్స్ జిల్లా కన్వీనర్ రాసూరి ప్రవీణ్ అన్నారు. మంగళవారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లా కన్వీనర్ రిషి, మెరుగు సిద్ధార్థ, వినయ్, నిశాంత్, సంపత్ పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డులో చెత్త శుద్ధీకరణ



బయోమైనింగ్ మిషన్ ప్రారంభించి వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మున్సిపల్ పరిధిలో సేకరించిన చెత్తను శుద్ధీకరణ చేసేందుకు ఏర్పాటు చేసిన బయోమైనింగ్ మిషన్‌ను మంగళవారం ఎమ్మెల్యే విజయరమణారావు మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్‌తో కలిసి ప్రారంభించారు. పట్టణంలో స్థలాభావంతో రాఘవాపూర్ శివారులో గల స్థలంలో మున్సిపల్ చెత్తను డంప్ చేస్తున్నారు. డంప్ యార్డులో చెత్తను పోయడంతో వెలువడే దుర్గంధం భరించలేకపోతున్నామంటూ సమీపంలోని గౌరెడ్డిపేట గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. బయోమైనింగ్ మిషన్ ఏర్పాటుతో ఇబ్బందులన్నీ దూరమవుతాయని ఎమ్మెల్యే అన్నారు.

**బహుళ ప్రయోజనాలు..**

చెత్తను బయోమైనింగ్ మిషన్‌తో వేరు చేయడం వల్ల బహుళ ప్రయోజనాలుంటాయని ఎమ్మెల్యే అన్నారు. హైదరాబాద్‌కు చెందిన సాగర్ మోటార్స్ అనే సంస్థకు ప్రభుత్వం కాంట్రాక్టు అప్పగించిందని, ఈ చెత్తాచెదారాన్ని ఆరు మాసాల్లోగా శుభ్రం చేస్తారన్నారు. మేనేజర్ శివప్రసాద్, కౌన్సిలర్లు మల్లయ్య, సంపత్, నాయకులు ఎరుకల రమేశ్, పైడ రవి తదితరులున్నారు.

## కార్మికులకు మెరుగైన వైద్య సేవలు



క్యాంపును పరిశీలిస్తున్న ఎస్.సుధాకర్‌రావు

రామగిరి: సింగరేణి కార్మికులు, కాంట్రాక్టు కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆర్జీ–3 జీఎం ఎస్.సుధాకర్‌రావు అన్నారు. మంగళవారం ఆర్జీ–3 పరిధిలోని ఓసీపీ–2లోని కాంట్రాక్టు కార్మికులకు రామగుండం రీజనల్ సింగరేణి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్డియాక్ స్క్రీనింగ్ క్యాంపును ప్రారంభించారు. కార్మికులకు చేస్తున్న వైద్య పరీక్షలను పరిశీలించారు. ఎస్‌వోటూ జీఎం రఘుపతి, గుర్తింపు సంఘాల ప్రతినిధులు ఎంఆర్‌సీరెడ్డి, కోట రవీందర్‌రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటరమణ, డా.కళ్యాణ్ చక్రవర్తి, కె.రాజేందర్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం పెంపొందించేందుకే సింగరేణి సంస్థలో వన మహోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆర్జీ–3 జీఎం ఎస్.సుధాకర్‌రావు అన్నారు. ఆర్జీ–3 పరిధిలోని ఓసీపీ–2లో వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించగా.. ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. ప్రతిజ్ఞ చేశారు. ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ ఎంఆర్‌సీరెడ్డి, కోట రవీందర్‌రెడ్డి, సీహెచ్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

### లా ఆఫీసర్ల నియామకానికి ఉత్తర్వులు

గోదావరిఖనిటౌన్: జిల్లాలోని వివిధ కోర్టుల్లో 6 నెలల కాలపరిమితికి గాను నూతనంగా సీనియర్ న్యాయవాదులను గవర్నమెంట్ ప్లీడర్(జీపీ), అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్(ఏజీపీ)లుగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా ప్రిన్సిపల్ కోర్టుకు వెంకటసాంబమూర్తి(జీపీ), పెద్దపల్లి సీనియర్, జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు శ్రీనివాస్(ఏజీపీ), మంథని సీనియర్, జూనియర్ సివిల్ కోర్టుకు వెంకటరాంరెడ్డి(ఏజీపీ), సుల్తానాబాద్ జూనియర్ సివిల్ కోర్టుకు లక్ష్మీరాజం(ఏజీపీ), గోదావరిఖని ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్ అండ్ లేబర్ కోర్టు కమ్, అడిషనల్ డిస్ట్రిక్ట్ కోర్టుకు రాజయ్య, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గోదావరిఖని కోర్టుకు పద్మజ, సీనియర్ సివిల్ జడ్జి కోర్టు గోదావరిఖనికి కిషన్‌రావును అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్(ఏజీపీ)లుగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.